క్లుప్తంగా

స్వచ్ఛతలో భాగస్వాములుకండి



పరిసరాలు శుభ్రం చేస్తున్న మల్లికార్జున్

హుస్నాబాద్: పట్టణ ప్రజలు పబ్లిక్ టాయిలెట్లను వినియోగించుకుని స్వచ్ఛతలో భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ పిలుపునిచ్చారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా స్థానిక ఎల్లమ్మ దేవాలయం సమీపంలోని పబ్లిక్ టాయిలెట్ల వద్ద మంగళవారం శ్రమదానం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజలంతా పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తడి, పొడి, హానికరమైన చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనానికి అందించాలని కోరారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

'ఈ పాస్'తోనే అమ్మకాలు



మాట్లాడుతున్న ఏడీఏ పద్మ

చిన్నకోడూరు(సిద్దిపేట): ఎరువుల దుకాణాల నిర్వాహకులు ఈ పాస్ యంత్రాల ద్వారానే ఎరువులు అమ్మాలని, ఎక్కువ ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని ఏడీఏ పద్మ హెచ్చరించారు. స్థానిక రైతువేదికలో ఎరువుల దుకాణదారులతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలన్నారు. రైతులకు నకిలీ విత్తనాలను అంటగట్టవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏఓ జయంత్ కుమార్, ఏఈఓలు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ శిబిరం తనిఖీ



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య

బెజ్జంకి(సిద్దిపేట): మహిళలు స్వయం ఉపాధితో ఆదాయాన్ని వృద్ధి చేసుకోవాలని డీఆర్‌డీఓ జయదేవ్ ఆర్య సూచించారు. గ్రామీణ అభివృద్ధిశాఖ, యూనియన్ బ్యాంక్‌ల ఆధ్వర్యంలో బెజ్జంకిలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ శిబిరాన్ని మంగళవారం ఆయన తనిఖీ చేశారు. శిక్షణలో పాల్గొన్న మహిళలకు అందుతున్న వసతుల గురించి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శిక్షణ అనంతరం స్వయం ఉపాధి కోసం బ్యాంకు రుణాలు పొందవచ్చన్నారు. శిక్షణ పూర్తిచేసుకుని ధ్రువపత్రాలు పొందిన మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డీఆర్‌డీఓ సతీశ్, ఎంపీడీఓ ప్రవీణ్, ఏపీఎం నర్సయ్య, ఏపీఓ రాజాబాబు, ట్రైనర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.2లక్షల విరాళం



విరాళం అందజేస్తున్న రైతులు

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని గోనెపల్లి సీతారామంజనేయ ఆలయ పునర్నిర్మాణానికి పాడి రైతులు తమవంతు సాయంగా మంగళవారం రూ.2 లక్షలు ఆలయ నిర్వాహకులకు అందజేశారు. నిర్వాహకులు విరాళం అందించిన దాతలను అభినందించారు.

ఫ్యాన్‌లు అందజేత



ఫ్యాన్‌లు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

సిద్దిపేటకమాన్: సిద్దిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2007–08 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు పట్టణంలో మంగళవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల చదువుకునే రోజుల్లో తమ తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. తమకు పాఠాలు బోధించిన గురువులను ఘనంగా సన్మానించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థుల సౌకర్యార్థం ఫ్యాన్‌లు అందజేశారు. పాఠశాల సిబ్బంది వారిని అభినందించారు. కార్యక్రమంలో హరీశ్, నరేశ్, చిత్రయాదవ్, నాగమణి, టీచర్లు రవీందర్‌రెడ్డి, గీత, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

నెరవేరుతున్న సొంతింటి కల

ముమ్మరంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

- మండల వ్యాప్తంగా 392 ఇళ్లు మంజూరు
- పైలెట్ ప్రాజెక్టు ద్వారా పొరెడ్డిపల్లికి మరో 100 ఇళ్లు
- కోహెడకు 33 మంజూరు, నిర్మాణ దశలో 31 ఇళ్లు
- మంత్రి పొన్నంకు లబ్ధిదారుల కృతజ్ఞతలు



కోహెడలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు

కోహెడ(హుస్నాబాద్): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ప్రభుత్వం మొదటి విడతగా మండలంలోని 27 గ్రామాలకు 392 ఇళ్లు మంజూరు చేసింది. లబ్ధిదారులు కూడా తమ ఇళ్ల నిర్మాణ పనుల్లో నిమగ్నమయ్యారు.

కోహెడకు 33 ఇళ్లు మంజూరు

మండల కేంద్రానికి 33 ఇళ్లు మంజూరయ్యాయి. అందులో 31 ఇళ్లు పనులు పునాది దశలో ఉన్నాయి. తహసీల్దార్, పంచాయతీ కార్యదర్శి అనుమతితో లబ్ధిదారులకు ప్రభుత్వం ఎనిమిది ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను ఉచితంగా అందిస్తుంది. అంతేకాకుండా మహిళా సంఘాల నుంచి మరో రూ.లక్ష రుణం కుడా మంజూరు చేస్తూ నిర్మాణ పనులను ప్రోత్సహిస్తోంది. దీంతో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు.

పైలెట్ ప్రాజెక్టు కింద మరో 100

రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవతో పైలెట్ ప్రాజెక్టు కింద తొలిదశలో పొరెడ్డిపల్లి గ్రామానికి 100 ఇళ్లు మంజూరయ్యాయి. పనులు సైతం కొనసాగుతున్నాయి. దీంతో మండలానికి మొత్తం 492 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయి. మంత్రి పొన్నం ప్రభాకర్ ద్వారా తమ సొంతింటి కల సాకారం కావడంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బిల్లుల చెల్లింపులు ఇలా..

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.5 లక్షలకు చెందిన చెల్లింపులు ఈ విధంగా చేయనున్నారు. బేస్మెంట్ నిర్మాణం తర్వాత మొదటి బిల్లు రూ.లక్ష, గోడల నిర్మాణం అనంతరం రెండో బిల్లు మరో రూ.లక్ష, అలాగే స్లాబు వేసిన తర్వాత మూడో బిల్లు కింద రూ.2 లక్షలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత చివరి బిల్లు రూ.1లక్ష (ఇందులో మరుగుదొడ్డి, ప్లాస్టరింగ్, తలుపులు అమర్చిన తర్వాత) లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో జమ చేస్తారు.

చాలా సంతోషంగా ఉంది



ఇందిరమ్మ ఇళ్లు త్వరగా పూర్తికావాలని నిర్మాణం పనులు చేపట్టాం. ప్రభుత్వం నుంచి ఎనిమిది ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుక ఉచితంగా అందింది. ఇళ్ల బేస్మెంట్ పూర్తయింది. మొదటి విడత డబ్బుల చెల్లింపు కొసం బ్యాంక్ ఖాతా వివరాలను కార్యదర్శికి ఇచ్చాను. మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.

– తలారి లత, లబ్ధిదారు, కోహెడ

31 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి



కోహెడ గ్రామానికి 33 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో ఒకటి దివ్యాంగులకు కేటాయించాం. ప్రస్తుతం 31 మంది ఇళ్ల నిర్మాణాలు పునాది దశలో ఉన్నాయి. ఈ వారంలో 15 మందికి మొదటి బిల్లు చెల్లింపులు కానున్నాయి. నిర్మాణ పనులను ఎంపీడీఓ, ఎంపీఓలు పర్యవేక్షిస్తున్నారు.

– నాగరాజు, పంచాయతీ కార్యదర్శి

'ఉల్లాస్'పై ఉపాధ్యాయులకు శిక్షణ



మిరుదొడ్డి(దుబ్బాక): ఉల్లాస్ యాప్ శిక్షణకు హాజరైన హెచ్‌ఎంలు, టీచర్లు

మిరుదొడ్డి(దుబ్బాక)/మద్దూరు(హుస్నాబాద్): డ్వాక్రా మహిళా గ్రూపుల్లో చదువురాని వారిని గుర్తించి ఉల్లాస్ యాప్‌లో నమోదు చేయాలని మిరుదొడ్డి, అక్బర్‌పేట-భూంపల్లి మండలాల ఎంఈఓలు ప్రవీణ్‌బాబు, అంజాగౌడ్‌తో పాటు మద్దూరు ఎంపీడీఓ రామ్మోహన్ కోరారు. మిరుదొడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఐకేపీ వీఓఏ లీడర్లు, ఐసీడీఎస్ అధికారులకు మంగళవారం ఉల్లాస్ యాప్‌పై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యాప్‌లో పేర్లు నమోదైన మహిళలకు డ్వాక్రా మహిళలు వాలంటీర్లుగా వ్యవహరిస్తారన్నారు. చదువురాని మహిళలకు ఆన్‌లైన్ లేదా ప్రత్యక్షంగా చదువు నేర్పించి పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. పరీక్షల్లో పాసైన మహిళలను ఓపెన్ టెన్త్, ఓపెన్ ఇంటర్ పరీక్షలకు సన్నద్ధం చేయవచ్చని తెలిపారు. ఉల్లాస్ యాప్ విధి విధానాలను ఎంఈఓలు పర్యవేక్షిస్తారని చెప్పారు. కార్యక్రమాలలో మిరుదొడ్డి ఎంపీడీఓ గంగుల గణేశ్‌రెడ్డి, హెచ్‌మాస్టర్లు, టీచర్లు, వీఓఏలు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, మద్దూరులో ఎంఈఓ వరదరాజు, మీనాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేయాలి



బ్రిడ్జిపై నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నిరసన కార్యక్రమంలో సీపీఎం నేతలు

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని కడవేర్గు శివారులో నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులను వెంటనే పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు కొంగరి వెంకట్ మావో డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో బ్రిడ్జి వద్ద నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ లో లెవల్ వంతెనతో కడవేర్గు, పరిసర గ్రామాల ప్రజలు పడుతున్న ఇబ్బందులపై చేసిన పోరాటాల ఫలితంగా గత ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.80 కోట్లు మంజూరు చేసిందన్నారు. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ మధ్యలోనే నిలిపివేసినా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోయారు. వర్షాలు కురిస్తే ప్రజలు ఇబ్బందిపడాల్సిన పరిస్థితి నెలకొందని, ఉన్నతాధికారులు స్పందించి పనులు పూర్తి చేయించాలని కోరారు. కార్యక్రమంలో అరుణ్, సత్తయ్య, శ్రీనివాస్, యాదగిరి, మహిపాల్, బాబు, బుచ్చయ్య, ఆంజనేయులు, మల్లయ్య, ప్రశాంత్, నాగరాజు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన మహిళలు

రెవెన్యూ సిబ్బంది నివేదికపై ఆగ్రహం

రామచంద్రాపూర్ మహిళల బైఠాయింపు

కోహెడ(హుస్నాబాద్): రామచంద్రాపూర్‌లో గ్రామదేవత ఎల్లమ్మ ఆలయం పునర్నిర్మాణం కోసం ప్రభుత్వ భూమి కేటాయింపు విషయంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నతాధికారులకు తప్పుడు నివేదిక ఇచ్చారని ఆరోపిస్తూ గౌడ కులస్తులు మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళనకు దిగారు. ఈ సందర్భగా వారు మాట్లాడుతూ సర్వే నంబరు 390లోని 0.14 ఎకరాల భూమిలో ఎల్లమ్మ ఆలయ నిర్మాణం కోసం కేటాయించిన భూమి 20 యేళ్ల క్రితం నుంచి తమ అధీనంలో ఉందన్నారు. ముగ్గురు రైతులు ఆ స్థలంలో పశుగ్రాసం ఉంచడంతో భూమి ఆ రైతుల అధీనంలోనే ఉన్నట్లు రెవెన్యూ సిబ్బంది గ్రామానికి చెందిన తప్పుడు నివేదిక ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోకా విచారణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తహసీల్దార్ సమీర్ అహ్మద్‌ఖాన్ సైతం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన చెందారు. పోలీసుల జోక్యంతో వారు ఆందోళన విరమించారు.

కాంగ్రెస్ పాలనలోనే రైతు సంక్షేమం

రైతులకు పెట్టుబడి సాయం కింద భరోసా అందించినందుకు గాను కాంగ్రెస్ నాయకులు రైతులతో కలిసి జిల్లా వ్యాప్తంగా సంబురాలు నిర్వహించారు. మంగళవారం బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. ఈ సందర్భంగా సిద్దిపేటలో నిర్వహించిన కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలోనే రైతుల సంక్షేమం సాధ్యమవుతుందన్నారు.



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పంటచేలో సంబురాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)/కొమురవెల్లి(సిద్దిపేట)/హుస్నాబాద్/చేర్యాల(సిద్దిపేట)/గజ్వేల్‌రూరల్/చిన్నకోడూరు(సిద్దిపేట)/బెజ్జంకి(సిద్దిపేట)/జగదేవ్‌పూర్(గజ్వేల్): సిద్దిపేటలోని నర్సాపూర్ పంట చేనులో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ వేడుకలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా పెట్టుబడి కింద ఎకరానికి రూ.6 వేల రైతు భరోసాగా రైతుల ఖాతాలలో రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందన్నారు. కార్యక్రమంలో మహేందర్, అర్షద్ హుస్సేన్, మధు, గాయాజొద్దీన్, నజ్జు, కావేరి, పద్మారెడ్డి, రాజిరెడ్డి, శ్రీకాంత్, ఫయాజ్, సలీం, పవన్ పాల్గొన్నారు. కొమురవెల్లి మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ చెరుకు రమణారెడ్డి, వంశీ, జంగని రవి తదితరులు పాల్గొన్నారు. హుస్నాబాద్ రైతువేదిక వద్ద జరిగిన కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, చిత్తారి రవీందర్, బంక చందు తదితరులు ఉన్నారు. చేర్యాలలో మండల, పట్టణ అధ్యక్షులు కొమ్ము రవి, దాసరి శ్రీకాంత్ ఆగంరెడ్డి, మల్లేశం, కొండల్‌రెడ్డి, నర్సింగరావు, లింగం, నరేందర్, సతీశ్, చంద్రయ్య, చిరంజీవులు, నాగరాజు, ప్రసాద్, రాములుగౌడ్, ఖాజా, సన్నీ, జహీరొద్దీన్ తదితరులు పాల్గొన్నారు. గజ్వేల్ రైతు వేదికలో ఏఎంసీ వైస్‌చైర్మన్ సర్దార్‌ఖాన్, ఆత్మ కమిటీ చైర్మన్ మల్లారెడ్డి, వ్యవసాయశాఖ అధికారులు, కాంగ్రెస్ నాయకులు సంబురాలు జరిపారు. చిన్నకోడూరులో కాంగ్రెస్ కిసాన్ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు కొండం శ్రీనివాస్‌రెడ్డి, అంకార్ మధు పాల్గొన్నారు. బెజ్జంకిలో పార్టీ మండల అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, ఏఎంసీ చైర్మన్ పులి కృష్ణ, ఆలయ కమిటీ చైర్మన్ జెల్ల ప్రభాకర్, సంతోష్, రాజు, శరత్, మల్లేశం, శాదిక్, రాజేశం, రమేశ్ తదితరులు పాల్గొన్నారు. జగదేవ్‌పూర్, మునిగడప రైతు వేదికలలో ఏఎంసీ చైర్మన్ నరేందర్‌రెడ్డి, ఏడీఏ అనిల్, ఏఓ వసంతరావు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, ఏఈఓలు, రైతులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో భవిష్యత్ నాశనం



ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): ఉన్నత పాఠశాలలో మొక్క నాటుతున్న ఏసీపీ రవీందర్‌రెడ్డి



కొమురవెల్లి(సిద్దిపేట): అయినాపూర్ ఉన్నత పాఠశాల విద్యార్థుల మానవహారం



నంగునూరులో చేయిస్తున్న ఎస్‌ఐ ఆసిఫ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు



బెజ్జంకిలో మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు



మద్దూరు(హుస్నాబాద్): మాట్లాడతున్న ఎక్సైజ్ సీఐ నరసింహులు



కోహెడరూరల్(హుస్నాబాద్): విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ అభిలాష్



హుస్నాబాద్‌రూరల్: అవగాహనక కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్‌ఐ మహేశ్

మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్ నాశనమవుతుందని పలువురు పోలీసు అధికారులు పిలుపునిచ్చారు. డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలపై అవగాహన కార్యక్రమంలో భాగంగా మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పలువురు సీఐలు, ఎస్‌ఐ, ఏఎస్‌ఐ, షీటీమ్ అధికారులు పాల్గొని జిల్లా వ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించారు. వివిధ కూడళ్లలో విద్యార్థులు మానవహారాలుగా ఏర్పడి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.



సిద్దిపేటరూరల్: మాట్లాడుతున్న ఎస్‌ఐ అపూర్వరెడ్డి

దరఖాస్తు చేసుకోండి

నంగునూరు(సిద్దిపేట): అక్కెనపల్లి మోడల్‌స్కూల్, నర్మెటలోని కేజీబీవీలో కుక్, అటెండర్, వాచ్‌ఉమెన్ పోస్టులకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ దేశిరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పాసై, 25 నుంచి 55 యేళ్ల లోపు మహిళలు ఆయా పాఠశాలల్లో 30వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పేదల సంక్షేమం పట్టదా?

ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. గజ్వేల్‌లో సీఎం సహాయనిధి చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహాయ నిధి ద్వారా గతంలో పేదలకు గరిష్టంగా సాయం మంజూరయ్యేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదని వాపోయారు. హామీలు అమలు చేయడంలోనూ ప్రభుత్వం విఫలమైందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు తెలంగాణలో ఆంధ్రా నేతల పెత్తనం నడుస్తోందని, తెలంగాణ నీళ్లను దోచుకునేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళి, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఊడెం కృష్ణారెడ్డి, నాయకులు రాంచంద్రం, మర్కంటి కనకయ్య, గంగిశెట్టి రవీందర్, స్వామిచారి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **ప్రభుత్వ పాఠశాలలో ఫుడ్ ఫెస్టివల్**

సిద్దిపేటఅర్బన్: పొన్నాల ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఉత్సాహంగా ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు పాయసం, సేమియా, ఇడ్లీ, పూరీ, వడ, సర్వపిండి, పులిహోర లాంటి 60 రకాల పదార్థాలు తయారు చేసి ప్రదర్శించారు. వాటిలో ఉత్తమమైన మూడింటిని ఉపాధ్యాయులు ఎంపిక చేసి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ నేత ఇంద్రసేనారెడ్డి, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు స్వప్న, శ్రీవిద్య, సౌజన్య, సుధ, స్వప్న, శిరీష, స్వప్న, వేణుగోపాలచారి తదితరులు పాల్గొన్నారు.

◆ **నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం**

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నర్సాపూర్ బైపాస్ రోడ్డు, నర్సాపూర్ ప్రాంతాలలో బుధవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

◆ **విద్యుత్ బకాయిల కోసం నోటీసులు**

మద్దూరు(హుస్నాబాద్): పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయిలు చెల్లించాలని బయోటెక్ (పోడ్యూస్ ఎనర్జీ)కంపెనీకి నోటీసులు జారీ చేసినట్లు విద్యుత్‌శాఖ చేర్యాల ఏడీఈ వెంకట్‌గౌడ్ తెలిపారు. మంగళవారం ఆ కంపెనీ గోడపై నోటీసులు అంటించారు. ఆయన మాట్లాడుతూ ఆ కంపెనీ రూ.15,68,649 బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. చెల్లించని పక్షంలో ఆస్తులను జప్తు చేయనున్నట్లు తెలిపారు.

◆ **దరఖాస్తుల ఆహ్వానం**

చేర్యాల(సిద్దిపేట): మండల పరిధిలోని ముస్త్యాల మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు హిందీ బోధించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీనుగు భిక్షం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హిందీ పండిట్ పూర్తిచేసి టెట్ పాసైన వారు అర్హులని, 26లోగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

◆ **భూసార పరీక్షలతో రైతుకు మేలు**

చేర్యాల(సిద్దిపేట): భూసార పరీక్షలు నిర్వహించి అందుకు అనుగుణంగా పంట సాగు చేయడం ద్వారా అధిక దిగుబడి పొందవచ్చని ఏఈఓ పూజ చెప్పారు. మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో మంగళవారం ఆమె పొలాలను పరిశీలించి భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరించారు. ఆమె వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ కనకయ్య, మాజీ ఉప సర్పంచ్ నర్సిరెడ్డి, రైతులు రాములు, పరమేశ్వర్, రాజయ్య పాల్గొన్నారు.

◆ **మందుబాబులకు జరిమానా**

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వారికి సిద్దిపేట కోర్టు జరిమానా విధించింది. ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని పలు ప్రాంతాలలో పది రోజుల క్రితం నిర్వహించిన వాహన తనిఖీల్లో 13 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరు పర్చగా మంగళవారం విచారణ జరిపిన న్యాయమూర్తి రూ.20,500 జరిమానా విధించారు.

స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి

మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్



ప్రదర్శనను తిలకిస్తున్న మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్, వైస్ చైర్మన్ కనకరాజు

సిద్దిపేటజోన్: స్వయం ఉపాధితో ఆర్థికాభివృద్ధి సాధ్యమని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ అన్నారు. స్థానిక ఎన్జీఓ భవన్‌లో పట్టణ మెప్మా ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మహిళ పొదుపు సంఘాల తయారీ ఉత్పత్తుల ప్రదర్శనను ఆయన తిలకించారు. ఒక మార్పు అభివృద్ధికి మలుపు, స్వచ్ఛతపై తొలిఅడుగు అనే థీమ్‌తో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మహిళలను శక్తివంతం చేయడంలోను, వారి ఉత్పత్తులను ప్రోత్సహించడంలోను స్వయం సహాయక సంఘాల పాత్ర ఎంతో కీలకం అన్నారు. ప్లాస్టిక్ నిషేధం, వ్యర్థాల నిర్వహణ, పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలలో ముందుండాలని సూచించారు. వైస్ చైర్మన్ కనకరాజు మాట్లాడుతూ మహిళ సంఘాల ఉత్పత్తుల విక్రయాల కోసం ప్రత్యేక భవనం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తానన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు శోభారాణి, తస్లిమ్, సాయి, లక్ష్మణ్, మెప్మా అధికారులు, మహిళ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.